క్లుప్తంగా

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం



ఆర్చ్ పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ రంగా నర్సింహగుప్తా

చైతన్యపురి: చైతన్యపురి డివిజన్ సాయినగర్ కాలనీలో నిర్మించబోయే ఆర్చ్‌కు స్థానిక కార్పొరేటర్ రంగానర్సింహగుప్తా ముఖ్యఅతిథిగా పాల్గొని శంకుస్థాపన చేశారు. కాలనీ సంక్షేమ సంఘం, శ్రీప్రసన్నాంజనేయ సహిత శివాలయం సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మాట్లాడుతూ, కాలనీల అభివృద్ధికి, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించటానికి ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. కాలనీల రహదారులు శుభ్రంగా ఉంచుకోవాలని, పచ్చదనం పెంపునకు కృషి చేయాలని కాలనీ సంక్షేమ సంఘానికి ఆయన సూచించారు. కాలనీవాసులు, స్థానిక బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

'పది'లో అన్వేషిని విద్యార్థుల హవా



విద్యార్థులను అభినందిస్తున్న అన్వేషిని పాఠశాల కరస్పాండెంట్ విజయసింహా రెడ్డి

చంపాపేట: చంపాపేట డివిజన్ బైరామల్‌గూడలోని అన్వేషిని ఉన్నత పాఠశాల విద్యార్థులు పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ జీపీఏ గ్రేడ్‌లు సాధించారని పాఠశాల కరస్పాండెంట్ విజయసింహా రెడ్డి తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థుల అభినందన కార్యక్రమం పాఠశాలలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జీపీఏ 9.8 గ్రేడ్‌లు ఏడుగురు విద్యార్థులు, 9 నుంచి 9.6 వరకు జీపీఏ 11 మంది విద్యార్థులు సాధించారని తెలిపారు. పరీక్షల్లో ఉత్తమ గ్రేడ్‌లు సాధించిన విద్యార్థులకు ఆయన పూల బొకేలు అందించి అభినందించారు.

రవికుమార్‌గౌడ్‌కు అభినందనలు



రవికుమార్‌గౌడ్‌ను సన్మానిస్తున్న నర్సింహారావు

మన్సూరాబాద్: తెలంగాణ రాష్ట్ర కల్లుగీత పారిశ్రామిక సహకార సంస్థ తొలి చైర్మన్‌గా నియమితులైన పల్లె రవికుమార్‌గౌడ్‌ను డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ట్రస్ట్ చైర్మన్ కొంగరి నర్సింహారావు గురువారం మర్యాదపూర్వకంగా కలిశాడు. పుష్పగుచ్ఛం అందించి శాలువతో సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్‌గౌడ్, రాజశేఖర్‌నేత, నర్సింహగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని చైర్మన్ అబ్దుల్లా సాది తెలిపారు. మున్సిపాలిటీ పరిధి పహాడీషరీఫ్ 14వ వార్డులో రూ.15 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను గురువారం ఆయన పరిశీలించారు. మున్సిపాలిటీ పరిధిలోని జల్‌పల్లి, పహాడీషరీఫ్, కొత్తపేట, షాహీన్‌నగర్ ప్రాంతాల్లో పెద్దఎత్తున అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయన్నారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని రూ.10 కోట్లతో కొనసాగుతున్న బాక్స్ డ్రెయిన్ పనులను పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మంత్రి సబితారెడ్డి చొరవతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మజ్లిస్ నాయకులు దస్తగిర్, షరీఫ్, అష్రఫ్ తదితరులు పాల్గొన్నారు.

హుడా కాలనీలో అధికారుల పర్యటన

హుడాకాంప్లెక్స్: పబ్లిక్ కాంటాక్ట్ ప్రోగ్రాం విత్ కాలనీ అసోసియేషన్ కార్యక్రమంలో భాగంగా గురువారం జీహెచ్‌ఎంసీ అధికారులు సరూర్‌నగర్ డివిజన్ పరిధి హుడాకాలనీలో పర్యటించారు. వర్షం పడినప్పుడు రోడ్ నం-10లో నీరు నిల్వ ఉండటంతో ఇబ్బందులు పడుతున్నామని, సీసీరోడ్డు వేస్తే సమస్య పరిష్కారమవుతుందని, ప్రతిరోజు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, దెబ్బతిన్న అంతర్గత రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని కాలనీవాసులు అధికారుల దృష్టికి తెచ్చారు. త్వరలో సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఈ ప్రశాంతి, సతీష్, జలమండలి అధికారి శంకర్, బీఆర్‌ఎస్ నాయకులు కొండల్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, కాలనీవాసులు అరవింద్‌కుమార్, మల్లారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ఆదిత్య, చైతన్య, వీరేశం పాల్గొన్నారు.

స్కేటింగ్‌కు పెరుగుతున్న ఆదరణ

- వనస్థలిపురంలో రూ.70 లక్షలతో స్కేటింగ్ గ్రౌండ్ అభివృద్ధి
- ప్రతి రోజూ 40 నుంచి 50 మందికి స్కేటింగ్‌లో ట్రైనింగ్
- ఇక్కడ శిక్షణ పొందిన ఐదుగురు ఇన్‌లైన్ హాకీ జాతీయ జట్టుకు ఎంపిక



ఇన్‌లైన్ హాకీ ఇండియా జట్టుకు ఎంపికైన విద్యార్థులతో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం: క్రీడలు మానసిక ఉల్లాసంతోపాటు దేహదారుఢ్యాన్ని పెంపొందిస్తాయి. నేడు చదువుల ధ్యాసలో పడి విద్యార్థులు క్రీడలను అంతగా పట్టించుకోవడం లేదు. దీంతో మానసిక, శారీరక రుగ్మతలకు గురవుతున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో వేసవి సెలవుల్లో పలు క్రీడా ప్రాంగణాలలో వివిధ రకాల క్రీడల్లో యువతకు ఉచిత శిక్షణ అందిస్తున్నారు. ఇందులో భాగంగా వివిధ ఆటలతో పాటు ఇప్పుడిప్పుడే ప్రాచుర్యం పొందుతున్న స్కేటింగ్, ఇన్‌లైన్ హాకీ నేర్చుకోవడానికి విద్యార్థులు ఆసక్తి చూపిస్తున్నారు.

- వనస్థలిపురం ఫేజ్-1 ఏ-టైపు క్వార్టర్స్‌లోని క్రీడా ప్రాంగణంలో జీహెచ్‌ఎంసీ నిధులు రూ.70 లక్షలతో అధునాతన స్కేటింగ్ గ్రౌండ్ నిర్మించారు. ఎస్‌ఎస్ రోలర్ అండ్ ఇన్‌లైన్ హాకీ క్లబ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు టంగుటూరి నాగరాజు ప్రోద్బలంతో ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి నిధులు మంజూరు చేయించి స్కేటింగ్ గ్రౌండ్ అభివృద్ధికి కృషి చేశారు.
- దీంతో స్కేటింగ్ స్పీడ్, ఇన్‌లైన్ హాకీ నేర్చుకోవడానికి ఇక్కడ ప్రాంగణం సిద్ధమైంది. ప్రస్తుతం రోజు 40 నుంచి 50 మంది ఇక్కడ స్కేటింగ్‌లో శిక్షణ పొందుతున్నారు. ఇక్కడ శిక్షణ పొందిన వారిలో ఐదుగురు విద్యార్థులు జాతీయ స్థాయిలో ఆడేందుకు ఇండియా జట్టుకు ఎంపికయ్యారు.
- ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి బుధవారం ఇన్‌లైన్ హాకీ ఇండియా జట్టుకు ఎంపికైన విద్యార్థులు శ్రీమాన్, నందిత, శ్రీపత్, సాయిచంద్ర, తన్మయ్‌లను అభినందించి భవిష్యత్‌లో వారు క్రీడల్లో మెరుగ్గా రాణించి దేశానికి పేరు తేవాలని ఆకాంక్షించారు.
- అలాగే స్కేటింగ్ గ్రౌండ్‌ను ఇండోర్ స్టేడియంగా అభివృద్ధి చేస్తామని, సిట్టింగ్ గ్యాలరీ, టాయిలెట్లు, డ్రెస్ చేంజ్ గదులు, తాగునీరు, క్లీనర్స్ తదితర అన్నిరకాల సౌకర్యాలు కల్పిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.



స్కేటింగ్ గ్రౌండ్‌లో ఇన్‌లైన్ హాకీ ఆడుతున్న విద్యార్థులు

స్కేటింగ్‌పై ఆసక్తి చూపిస్తున్నారు



స్కేటింగ్ స్పీడ్, ఇన్‌లైన్ హాకీ నేర్చుకోవడానికి విద్యార్థులు ఉత్సాహంగా వస్తున్నారు. రోజు 40 నుంచి 50 మంది వరకు స్కేటింగ్ నేర్చుకోవడానికి వస్తున్నారు. నాలుగేళ్ల చిన్నారులు మొదలు 15, 16 సంవత్సరాల వయస్సుగల విద్యార్థులు స్కేటింగ్ పట్ల ఆసక్తి చూపిస్తున్నారు. ఇక్కడ గ్రౌండ్‌లో వసతులు కలిస్తే ఇంకా మంచిగా శిక్షణ ఇవ్వడానికి అవకాశం ఉంటుంది.

– శ్రీనివాస్, కోచ్

ఎమ్మెల్యే చొరవతో గ్రౌండ్ అభివృద్ధి చేసుకున్నాం



ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సహకారంతో వనస్థలిపురంలో స్కేటింగ్ గ్రౌండ్‌ను అభివృద్ధి చేసుకున్నాం. ఇక్కడ శిక్షణ పొందిన 5 గురు విద్యార్థులు ఇన్‌లైన్ హాకీ ఇండియా జట్టుకు ఎంపికయ్యారు. సెప్టెంబరులో చైనాలో జరుగబోయే ఆసియన్ అండ్ వరల్డ్ ఇన్‌లైన్ హాకీ టోర్నమెంట్లలో ఇండియా తరపున ఆడనున్నారు.

– టంగుటూరి నాగరాజు, అధ్యక్షుడు, ఎస్‌ఎస్ రోలర్ అండ్ ఇన్‌లైన్ హాకీ క్లబ్ రంగారెడ్డి జిల్లా

రవీందర్‌రెడ్డికి బీజేపీ నేతల సన్మానం



కొత్తకాపు రవీందర్‌రెడ్డిని సన్మానిస్తున్న బండి సంజయ్, డాక్టర్ లక్ష్మణ్

సైదాబాద్: ఖేలో భారత్ పోటీల సందర్భంగా వాలీబాల్ క్రీడాపోటీల్లో జాతీయ స్థాయిలో ప్రాతినిధ్యం వహించిన మాజీ క్రీడాకారుడు, మలక్‌పేట బీజేపీ సీనియర్ నాయకుడు కొత్తకాపు రవీందర్‌రెడ్డిని బీజేపీ అగ్రనాయకులు సన్మానించారు. సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణారెడ్డి భర్త అయిన ఆయన గతంలో బ్యాంక్ ఉద్యోగిగా పనిచేసిన సమయంలో జాతీయ వాలీబాల్ పోటీల్లో పాల్గొని సత్తాచాటడమే కాకుండా తమ జట్టు పలుమార్లు గెలవడంలో కీలకపాత్ర పోషించారు. బ్యాంక్ ఉద్యోగిగా విరమణ పొందిన తర్వాత రాజకీయాల్లో క్రియాశీలకంగా ముందుకు వెళుతున్నారు. గత జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో తన భార్యను సైదాబాద్ డివిజన్‌కు బీజేపీ నుంచి కార్పొరేటర్‌గా గెలిపించుకున్నారు. జాతీయ స్థాయి క్రీడా పోటీల నేపథ్యంలో ఆయనను విక్టరీ ప్లే గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న ఖేలో భారత్ పోటీల సందర్భంగా పార్టీ తెలంగాణ అధ్యక్షుడు బండి సంజయ్, ఎంపీ డాక్టర్ లక్ష్మణ్, బీసీసీ చైర్మన్ హన్స్‌రాజ్‌లు జ్ఞాపికతో సత్కరించారు.

కాలనీలో బురద తొలగింపునకు చర్యలు



సరస్వతినగర్ వాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: వరదతో కాలనీలో పేరుకపోయిన బురదను వెంటనే తొలగించేందుకు చర్యలు చేపడుతున్నామని జీహెచ్‌ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. మన్సూరాబాద్ డివిజన్ సరస్వతినగర్ కాలనీలో వరదనీటి బురదతో రాకపోకలకు ఇబ్బందిగా మారి, దుర్వాసన వస్తోందని కాలనీవాసులు ఫిర్యాదు చేయడంతో ఆయన గురువారం కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, బురదను తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లాలని సిబ్బందికి సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. అసంపూర్తిగా ఉన్న వరదకాలువ పనులను త్వరలోనే పూర్తి చేయించి సమస్యను శాశ్వతంగా పరిష్కరింపజేస్తామన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు పాండుగౌడ్, రావుల రమేష్, వేమన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సత్యం, నర్రి వెంకన్న, శేఖర్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, మధుసూదన్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధికి నిధుల మంజూరుపై హర్షం

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ పరిధి జిల్లెలగూడలోని శ్రీ మత్స్యావతార వేంకటేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధికి రూ.కోటి నిధులు మంజూరు చేసిన సందర్భంగా గురువారం స్థానిక కార్పొరేటర్ బొక్క రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి సబితారెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వందేళ్ల చరిత్ర కలిగిన వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేయడంపై కార్పొరేటర్ హర్షం వ్యక్తం చేశారు. మంత్రిని కలిసినవారిలో ఆలయ ఫౌండర్, చైర్మన్ రాజా సంజయ్‌గోపాల్, ఆలయ ఈఓ శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన అర్చకులు రాఘవాచారి ఉన్నారు.

ముగిసిన వార్షిక బ్రహ్మోత్సవాలు

మీర్‌పేట: పట్టణంలోని శివసాయినగర్ కాలనీలో వెలసిన లక్ష్మీగణపతి ఆలయ 10వ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారంతో ముగిశాయి. ఉదయం స్వామివారికి పల్లకీ సేవ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయన్ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ తీగల సుభాష్ రెడ్డి, సభ్యులు సంతోష్‌రెడ్డి, వెంకట కృష్ణారావు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



తీగల కృష్ణారెడ్డిని సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

మూసారాంబాగ్‌లో హల్దీరామ్ రెస్టారెంట్ ప్రారంభం



రెస్టారెంట్‌ను ప్రారంభిస్తున్న హల్దీరామ్ చైర్మన్ శివకిషన్‌జీ అగర్వాల్

మలక్‌పేట: ప్రముఖ భారతీయ స్వీట్స్, స్నాక్స్ తయారీదారు హల్దీరామ్ సంస్థ గురువారం మూసారాంబాగ్‌లో తమ సరికొత్త రెస్టారెంట్‌ను ప్రారంభించింది. హల్దీరామ్ ఫుడ్స్ ఇంటర్నేషనల్ సంస్థ చైర్మన్ శివకిషన్‌జీ అగర్వాల్ దానిని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, భారతీయ ఆహారం, స్నాక్స్, స్వీట్స్‌తో వినియోగదారులకు మధురానుభూతి అందించడమే తమ సంస్థ లక్ష్యమని అన్నారు. మూసారాంబాగ్‌లో రెస్టారెంట్ ప్రారంభించడం హల్దీరామ్‌కు మైలురాయిగా భావిస్తున్నామన్నారు. వినియోగదారులకు మొదటిసారి లైవ్ భుజియా ఎక్స్‌పీరియెన్స్ అందించడం ఆనందంగా ఉందన్నారు. దేశంలో 200కు పైగా స్టోర్‌లు కలిగిన తమకు, హైదరాబాద్‌లో ఇది 16వ స్టోర్ అని ఆయన తెలిపారు.

మార్కెట్ యార్డు ఆదాయం పెంపునకు కృషి

ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డులో రూ.50 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను గురువారం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సాగర్ రోడ్డు నుంచి బృందావన్ కాలనీకి ఈ సీసీ రోడ్డు లింకు అవుతుందన్నారు. రోడ్డుకు ఇరువైపులా దుకాణ సుముదాయాలను నిర్మించి మార్కెట్ యార్డుకు ఆదాయం సమకూరేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రయ్య, వైస్ చైర్మన్ రవీందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ స్రవంతి, వైస్‌చైర్మన్ యాదగిరి, మార్కెట్ సెక్రటరీలు సంతోష్, శ్రీనివాస్, డైరెక్టర్లు, కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు



డబీర్‌పురా సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బలాల

చాదర్‌ఘాట్: విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఇందులో భాగంగా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటుకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. గురువారం అజంపురా డివిజన్‌లో యూపీహెచ్‌సీ ఆవరణలో రూ.13.35కోట్ల వ్యయంతో నిర్మించిన 33బై11 కేవీ డబీర్‌పురా సబ్‌స్టేషన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గంలో తలెత్తే విద్యుత్ సమస్యలను నివారించేందుకు చేపట్టాల్సిన చర్యల గురించి అధికారులతో ఎప్పటికప్పుడు సమావేశాలు ఏర్పాటు చేసి తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. డబీర్‌పురా స్టేషన్ నుంచి షా కాలనీ, అంజుమన్, ఫర్హత్‌నగర్, నూర్‌ఖాన్ బజార్, కోమటివాడి, డబీర్‌పురా, అజంపురా ప్రాంతాలకు విద్యుత్ సరఫరా అవుతుందన్నారు. ఆయా పరిధుల్లో గృహావసరాల కనెక్షన్లు 8200, వాణిజ్య సముదాయాలు 450, పరిశ్రమలు 55 సర్వీస్ కస్టమర్లు ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఎంఐఎం నేతలు మొహియుద్దీన్ అబ్రార్, సైఫుద్దీన్ షఫీ, టీఎస్‌ఎస్‌పీడీసీఎల్ సీజీఎం నర్సింహస్వామి, ఎస్ఈ బ్రహ్మం, ఎస్ఈ శ్రీనివాసచారి, డీఈ హన్మంత్‌రెడ్డి పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యానికి యోగా సాధన అవసరం



యోగా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఇస్మాయిల్ గురూజీ తదితరులు

హస్తినాపురం: సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేందుకు ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ యోగా సాధన చేయాల్సిన అవసరం ఉందని యోగా గురువు ఇస్మాయిల్ గురూజీ అన్నారు. హస్తినాపురంలోని మేజర్ పద్మపాణి ఆచార్య కమ్యూనిటీ హాల్‌లో ఈనెల 14 నుంచి ప్రారంభం కానున్న శ్రీషిర్డీ సాయి అష్టాంగ యోగా శిక్షణ తరగతుల బ్రోచర్‌ను గురువారం ఆయన కడారి చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగాల్ గురూజీ మాట్లాడుతూ, ఈనెల 14 నుంచి ప్రతిరోజూ ఉదయం 5 నుంచి 7 గంటల వరకు, సాయంత్రం 6.30 నుంచి 8.30 గంటల వరకు యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. ఇందులో వ్యాయామాలు, ప్రాణాయామాలు, ఆసనాలు, సూర్యనమస్కారాలు, ధ్యానం నేర్పిస్తామన్నారు. శిక్షణలో 14 నుంచి 80 సంవత్సరాల వయసు వారు పాల్గొనవచ్చన్నారు. కార్యక్రమంలో అలుగుబెల్లి వెంకట్‌రెడ్డి, సరిత, ప్రభాకర్ రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ఉపేందర్, నరేందర్, మల్లికార్జున్, కవిత విజయ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌టీపీఎఫ్ సదస్సును విజయవంతం చేయండి

ఫ్రంట్ కన్వీనర్ ప్రసాద్‌గౌడ్



జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద సదస్సు కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎస్‌టీపీఎఫ్ నేతలు

మన్సూరాబాద్: సామాజిక తెలంగాణ పొలిటికల్ ఫ్రంట్ (ఎస్‌టీపీఎఫ్) రంగారెడ్డి జిల్లా సదస్సును శనివారం మన్సూరాబాద్ డివిజన్‌లోని కామినేని చౌరస్తా సమీపంలోని ఎస్కే ఫంక్షన్‌హాల్ నిర్వహిస్తున్నామని, సదస్సును విజయవంతం చేయాలని ఫ్రంట్ కన్వీనర్ బొంగు ప్రసాద్‌గౌడ్ కోరారు. ఎల్‌బీనగర్‌లోని మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద సదస్సు కరపత్రాన్ని ఆయనతో పాటు సోషల్ జస్టిస్ పార్టీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు చామకూర రాజు ముఖ్యఅతిథులుగా హాజరై గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రసాద్‌గౌడ్ మాట్లాడుతూ, సామాజిక న్యాయం, సామాజిక ప్రజాస్వామ్యం ఉద్దేశంతో ఫ్రంట్ ఆవిర్భవించిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఫ్రంట్‌ను విస్తరించేందుకు కార్యక్రమాలు చేపడుతున్నామని, దానిలో భాగంగానే సదస్సును నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్యఅతిథులుగా ఫ్రంట్ చైర్మన్ ప్రొఫెసర్ మురళీమనోహర్, మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి హాజరవుతారన్నారు. చామకూర రాజు మాట్లాడుతూ పోరాటాలు, ఉద్యమాలతో సాధించుకున్న రాష్ట్రంలో ఆత్మగౌరవంతో కూడిన సామాజిక తెలంగాణ నిర్మాణం జరగడం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు కేవీ గౌడ్, ఆకర్ష్, మేడిగ శ్రీధర్, ఎల్లాపుల శ్యామ్, ప్రశాంత్, మేడి నరేష్, శ్యాంసుందర్‌గౌడ్, కుమార్, శ్రీకాంత్, వివిధ కుల, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఇద్దరు బైకు దొంగల అరెస్ట్

నాలుగు ద్విచక్రవాహనాల స్వాధీనం



నిందితులను, స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాలను చూపిస్తున్న పోలీసులు

హస్తినాపురం: జల్సాలకు అలవాటుపడి అవసరమైన డబ్బుల కోసం ద్విచక్రవాహనాలను దొంగిలిస్తున్న ఇద్దరు పాతనేరస్తులను వనస్థలిపురం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. గురువారం ఇన్‌స్పెక్టర్ దేవ జలేంధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ముసారాంబాగ్ ముక్తర్‌వాడకు చెందిన కేసరియా హరీష్ (29) ఈనెల 8న వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని చింతలకుంట రేడియో స్టేషన్ టవర్ ముందు పార్కుచేసిన హోండా యాక్టివాను దొంగిలించాడు. గురువారం ఉదయం పనామా చౌరస్తా దగ్గర పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా హరీష్ బైక్ (నం. టీఎస్07జేఎల్ 7684) పై వెళ్తున్నాడు. అతడిని ఆపి బండి పత్రాలు చూపించమనగా పారిపోయేందుకు యత్నించాడు. దీంతో అదుపులోకి తీసుకుని విచారించగా బైక్ చోరీ చేసి తెచ్చినట్టు తెలిపాడు. గతంలో హరీష్‌పై పేట్‌బషీరాబాద్, జీడిమెట్ల, మలక్‌పేట, చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్లలో దొంగతనం కేసులు నమోదయ్యాయని పోలీసులు తెలిపారు. ఇదిలా ఉండగా, హయత్‌నగర్ ముదిరాజ్ కాలనీకి చెందిన గుజ్జుల రాములు (26) జల్సాలకు అలవాటుపడి బైకు చోరీలకు పాల్పడుతున్నాడు. గురువారం సాగర్‌రోడ్డుపై బీఎన్‌రెడ్డినగర్ దగ్గర వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు బైకుపై వెళ్తున్న రాములును ఆపి తనిఖీ చేయగా పారిపోయేందుకు ప్రయత్నించాడు. అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించాడు. ఈనెల 3 రోజు వనస్థలిపురం రైతు బజార్ ముందు ఉన్న సాయిసూర్య వైన్స్ ముందు పార్కు చేసిన బైకు (నం. టీఎస్ 08ఈడబ్ల్యూ 9089) ను దొంగిలించినట్లు ఒప్పుకున్నాడు. ఇద్దరినీ అరెస్ట్‌చేసి రిమాండ్ కు తరలించి వారివద్ద నుంచి నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆహ్లాదం.. ఆనందం



సంజీవని పార్కు

కాంక్రీట్ జంగిల్‌తో విసిగిపోయిన జనానికి సంజీవని వనం ఆహ్లాదాన్ని పంచుతోంది. నగరం నడిబొడ్డున విస్తరించిన ఉన్న ఈ అడవిని పచ్చని వనంగా తీర్చిదిద్ది, పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేశారు. ప్రజలకు స్వచ్ఛమైన గాలి, వాతావరణాన్ని, చల్లని నీడను అందిస్తోంది.. అదే గుర్రంగూడ ఫారెస్ట్ సంజీవని వనం.

- టూరిజం స్పాట్‌గా సంజీవని వనం
- నగరానికి కూతవేటు దూరంలో అడవిని తలపించేలా పార్కు
- 20 ఎకరాల విస్తీర్ణంలో.. సెలవు దినాల్లో సందడిగా వనం

బడంగ్‌పేట్: బాలాపూర్ మండలం ఔటర్ రింగ్ రోడ్ హైవేపై ఉన్న గుర్రంగూడ ఫారెస్ట్‌ను ఆహ్లాదాన్ని పంచే సంజీవని వనంగా తీర్చిదిద్దారు. 20 ఎకరాల్లో విస్తరించిన ఈ అడవిని చక్కని టూరిజం స్పాట్‌గా మార్చారు. సుమారు 4కిలో మీటర్ల మేర వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేశారు. గుర్రంగూడ, బీఎన్‌రెడ్డి, వనస్థలిపురం, యాంజాల్, హస్తినాపురం తదితర ప్రాంతాలకు చెందిన ప్రజలు ప్రతిరోజూ వాకింగ్ చేసేందుకు వస్తుంటారు. కాంక్రీట్ జంగిల్‌తో విసిగిపోయిన ఆయా ప్రాంతాల ప్రజలు ఇక్కడికి వచ్చి కిట్టి పార్టీలు, కార్తీక వన భోజనాలు చేసి సంతోషంగా గడుపుతుంటారు. సెలవు దినాల్లో కుటుంబ సభ్యులు పిల్లలతో వచ్చి ఇక్కడ సేద తీరుతుంటారు. ఇక్కడ నీడనిచ్చే పెద్ద పెద్ద చెట్లు, చిన్న కోనేరు, ఎటు చూసినా పచ్చని గార్డెనింగ్, రకరకాల పూల మొక్కలు, ఔషధ మొక్కలు, చల్లని మినరల్ వాటర్ ప్లాంటును ఏర్పాటు చేశారు. సెలవులు వచ్చాయంటే సంజీవని వనం జనంతో కిక్కిరిసిపోతుంది. పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులను ఇక్కడికి ఫీల్డ్ ట్రిప్ కోసం తీసుకొస్తుంటారు. ప్రవేశ రుసుం పెద్దలకు రూ. 20, పిల్లలకు రూ.10 వసూలు చేస్తారు. వాహనాల పార్కింగ్‌కు స్థలం కేటాయించారు. సమావేశాలు, చిన్న పాటి వేడుకలు నిర్వహించుకోవడానికి ఓపెన్ షెడ్డును ఏర్పాటు చేశారు. ఒక్క సారి సంజీవని వనంలో అడుగు పెడితే సాయంకాలం దాకా ఇక్కడి నుంచి వెళ్లడానికి ఎవరూ ఇష్టపడరు. పార్కు క్లీన్ అండ్ గ్రీన్ ఉండడానికి చెత్త డబ్బాలు ఏర్పాటు చేశారు. ఇంకెందుకు ఆలస్యం పిల్లలతో కలిసి సంజీవని వనానికి వచ్చేయండి. ప్రకృతితో చక్కగా ఎంజాయ్ చేయండి.



సేద తీరేందుకు ఏర్పాటు చేసిన షెడ్డు